
సాక్షి పెద్దపల్లి

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



సీఎంను కలిసిన ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రగతి భవన్‌లో కలిశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



పత్తి క్వింటాల్‌కు రూ.7,477

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.7,477 పలికింది. కనిష్టంగా రూ.6,667, నగటున రూ.7,217గా నమోదైంది.

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండవేడి మరింత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతతో అసౌకర్యంగా ఉంటుంది.

కాలం నువ్వు కలిసే వ్యక్తులను,
హృదయం నువ్వు కోరే వ్యక్తులను,
నీ ప్రవర్తన నీతో ఉండే వారిని
నిర్ణయిస్తుంది. – మహమ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
బుధ	6:33	గురు	4:41

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు వద్దు

- కలెక్టర్ సంగీత వెల్లడి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మంథని: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లకుండా పకడ్బందీగా తనిఖీ చేయాలని కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. మంగళవారం మంథనిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటిని తరగతి గదుల్లోకి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెవెంట మంథని ఆర్డీఓ వీరబ్రహ్మచారి, తహసీల్దార్ బండి ప్రకాశ్ ఉన్నారు.

ఫైలేరియా పరీక్షలు చేయించుకోవాలి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న రాజేశం

సుల్తానాబాద్: ఫైలేరియా పరీక్షలు చేసేందుకు విద్యార్థులందరూ ముందుకురావాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ రాజేశం కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఐదు నుంచి ఆరేళ్లలోపు విద్యార్థులకు 'మైక్రో ఫైలేరియా' నిర్ధారణకు రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నామని, వ్యాధి ఉన్నవారిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ మధుకర్ రెడ్డి, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, హైస్కూల్ డైరెక్టర్ రవీందర్, కరస్పాండెంట్ సుజాత, ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి, సిబ్బంది శారద, జ్యోత్స్న, ల్యాబ్ టెక్నీషియన్ షకీల్, హెచ్‌ఏ లక్ష్మణ్, ఆశా కార్యకర్త సుగుణ, స్వరూప పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి



ఢిల్లీలో ధర్నా చేస్తున్న ఆర్.కృష్ణయ్యకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

సుల్తానాబాద్: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆర్.కృష్ణయ్య ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని, తద్వారా కులాలవారీగా జనాభా ఎంత ఉందో తెలుస్తుందని, ఈ అంశం ప్రభుత్వానికి ఉపయోగమే అయినా ఎందుకు వెనకడుగు వేస్తోందోనని ప్రశ్నించారు. కృష్ణయ్యను కలిసిన వారిలో మున్నూరు కాపు సంఘం యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్, కన్వీనర్ గుజ్జ కృష్ణ, గౌరవ అధ్యక్షులు దాసరి హనుమయ్య, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ ఉన్నారు.

'పది' పరీక్షకు 7920 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 7,920 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు. ఏడుగురు గైర్హాజరయ్యారని వివరించారు. జిల్లాకేంద్రంలోని బాలుర, బాలికోన్నత పాఠశాలలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేశాయన్నారు.



- మళ్లీ తెరపైకి బాధితుల 'డబ్బుల' బాగోతం
- సొమ్ము కోసం తప్పని ఎదురుచూపులు
- తీసుకున్న పైసలు ఇవ్వాలంటున్న మావోయిస్టులు
- తీసుకున్నది రూ.20కోట్లు.. చెల్లించేది రూ.9కోట్లే



డబ్బుల కోసం క్యూకట్టిన బాధితులు(ఫైల్)

ఆర్‌ఎఫ్‌సీఎల్.. అంతులేని కథ..!

సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని: ఉద్యోగాలొస్తే తమ జీవితాలు బాగుపడుతాయని అప్పు తెచ్చి కొందరు.. ఉన్న పొలాలు, స్థలాలు అమ్ముకుని మరికొందరు డబ్బులు తెచ్చి దళారుల చేతుల్లో పోశారు. పర్మినెంట్ ఉద్యోగం, క్వార్టర్, పీఎఫ్ అంటూ మభ్యపెట్టిన ఆశలతో ఉద్యోగంలోకి చేరిన వారు ఏడాది తిరగకముందే రోడ్డున పడ్డారు. న్యాయం చేయాలని, తమ డబ్బులు తమకు వాపస్ ఇవ్వాలని నిరసనలు, దీక్షలు, ధర్నాలు, ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు, చలో ఆర్‌ఎఫ్‌సీఎల్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. వీరికితోడుగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అఖిలపక్ష కమిటీ, మావోల బెదిరింపు లేఖలు.. ఇలా ఎన్ని రూపాల్లో పోరాటాలు సాగినా నేటికీ ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. తమకు రావాల్సి డబ్బులు కోసం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

అఖిలపక్షం వేసినా..

గతేడాది ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికుల ఆత్మహత్యాయత్నాలకు పాల్పడటం.. ఆందోళనలు ఉధృతం కావడంతో అన్నిపార్టీల నేతలతో కలిసి అఖిలపక్ష కమిటీని ఏర్పాటు చేశారు. వాస్తవానికి ఫ్యాక్టరీలో పని చేసేందుకు 450 మంది కార్మికులు అవసరం ఉండగా.. 790 మందిని తీసుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వసూలు చేశారు. ఈ క్రమంలో సుమారు రూ.20 కోట్ల మేర నిరుద్యోగ యువత నుంచి కాంట్రాక్టు ఉద్యోగాల పేర వసూళ్లకు పాల్పడినట్లు గతంలో అఖిలపక్ష కమిటీ నిర్ధారించింది. ఈ దందాలో ప్రధానంగా ఇద్దరు సబ్‌కాంట్రాక్టర్లు ఉండగా.. వారి కింద 76 మంది 'వసూల్‌రాజా'లున్నట్లు గుర్తించారు. వారి నుంచి వసూలు చేసిన సొమ్ము మొత్తం కార్మికులకు తిరిగి చెల్లించాల్సిందేనని అఖిలపక్ష కమిటీ పట్టుబట్టినప్పటికీ సాధ్యం కాలేదు. రూ.20 కోట్లలో రూ.ఏడుకోట్ల వరకు ఖర్చయ్యాయని, మిగతా డబ్బులు మాత్రమే తమతో సాధ్యమవుతుందని సబ్ కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు. దీంతో బాధితులు ఇచ్చిన డబ్బుల్లో కనీసం 60 శాతం మేర చెల్లించాలని అఖిలపక్ష కమిటీ కోరింది. ఆ మొత్తం కూడా చెల్లింపులు చేయకపోవడంతో కమిటీలో ఉన్న చాలామంది వైదొలిగారు. కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరగనప్పుడు తాముండి చేసేదేముందని స్వచ్ఛందంగా వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. కొంతమంది మాత్రం ముందుండి ఇప్పటికీ బాధితులకు 45శాతం చొప్పున ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. మొత్తం 790మందిలో 250మందికిపైగా ఎమ్మెల్యే సమీప గ్రామాల ప్రజలకు స్వచ్ఛందంగా ఉద్యోగాలు పెట్టించారు. మరో 120 మంది సొసైటీ ద్వారా ఉద్యోగాల్లో చేరారు. మిగితా సుమారు 420మంది బాధితులు డబ్బులు చెల్లించి ఉద్యోగాల్లో చేరినట్లు నిర్ధారించారు. ఇందులో వారి కుటుంబ పరిస్థితులను బట్టి డబ్బులు ఇస్తున్నారు. 45శాతం చెల్లింపులు కూడా జరగని బాధితులు రెండెంకల సంఖ్యల్లో ఉన్నట్లు బాధితులు వాపోతున్నారు.

మావోల లేఖతో మార్పు రాలే..

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరుతో తీసుకున్న డబ్బులు పూర్తిగా చెల్లించాల్సిందేనని మావోలు రెండువారాల కిందట లేఖ విడుదల చేశారు. గతంలోనూ వారికి న్యాయం చేయకపోతే దళారులకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. తాజాగా విడుదల చేసిన లేఖలో తీసుకున్న వాటిలో 45శాతం చెల్లింపులు కాదని, పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.

కొట్టుకున్న కాంట్రాక్టర్, కార్పొరేటర్

తాను ఉద్యోగం పెట్టించిన నిరుద్యోగులకు డబ్బులు చెల్లించాలని ఓ కాంట్రాక్టర్‌పై రామగుండం కార్పొరేటర్ ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో నలుగురు నిరుద్యోగులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.4లక్షలు చెల్లించారు. మిగితా డబ్బుల కోసం ఓ మధ్యవర్తి ద్వారా ఒత్తిడి పెంచినప్పటికీ సబ్‌కాంట్రాక్టర్లు ఇవ్వలేదంటూ రెండు రోజుల క్రితం గొడవ పడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకుని పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లారు. ఈ ఘటన గోదావరిఖనిలో ఆర్‌ఎఫ్‌సీఎల్ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

రెండేళ్లుగా తిరుగుతున్నా..



రెండేళ్ల కిందట ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగమంటే రూ.7లక్షలు మధ్యవర్తి ద్వారా చెల్లించా. కరోనాకు ముందు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇప్పటివరకు ఇవ్వలేదు. నాన్న కరోనాతో చనిపోయారు. ఉద్యోగం లేక ఇచ్చిన డబ్బులు చెల్లించలేక రోడ్డు వెంట తిరిగే పరిస్థితి వచ్చింది. ఎన్నిసార్లు వెళ్లినా రేపు, మాపు అంటూ వాయిదా వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

– రేణికుంట్ల రవితేజ, గోదావరిఖని

సొంత శాఖలోనే వివక్ష..



ఎండలో నిలబడి పేర్లు నమోదు చేసుకుంటున్న దివ్యాంగులు

- సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం
- ఉపకరణాల ఎంపిక శిబిరంలో దివ్యాంగుల తంటా
- అధికారుల తీరుపై అసహనం
- సందర్శించిన జెడ్పీ చైర్మన్, జిల్లా సంక్షేమ అధికారి



ఎండలోనే వస్తున్న దివ్యాంగుడు



వీల్‌చైర్ లేక కిందనే కూర్చున్న దివ్యాంగుడు

మంథని: దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు పనిచేయాల్సిన ఆ శాఖలోనే దివ్యాంగుల పట్ల వివక్ష కొనసాగుతోంది. ఇందుకు మంథనిలో మంగళవారం నిర్వహించిన సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరమే ఉదాహరణగా చెప్పవచ్చు. కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు శారీరక దివ్యాంగులకు సహాయ ఉపకరణాల అందించేందుకు పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గకేంద్రాల్లో ఎంపిక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శిబిరం ఏర్పాటు చేశారు. అయితే కనీసం టెంట్ గానీ.. తాగునీరు, వీల్‌చైర్లు, కుర్చీలు, మ్యాట్, సహాయకులు ఇలా ఎలాంటి కనీస సౌకర్యాలూ సమకూర్చకపోవడంతో దివ్యాంగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కార్యాలయం ప్రహరీ నుంచి శిబిరం వరకు మ్యాట్ లేకపోవడంతో వికలాంగులు ఎండలో ఇబ్బంది పడుతూ రావడం కనిపించింది. మరోవైపు సరిపడా కుర్చీలు లేకపోవడంతో చాలామంది దివ్యాంగులు కింద, చెట్ల కోసం నిర్మించిన గద్దెలపై కూర్చున్నారు. దివ్యాంగులకు సహాయపడేవారు కూడా లేకపోవడంతో ఇబ్బందులు రెట్టింపు అయ్యాయి. కొందరు దివ్యాంగులు మీడియా దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు తాగునీరు, కుర్చీలను ఏర్పాటు చేశారు. ఉదయం తొమ్మిది గంటల వరకే దివ్యాంగులు శిబిరానికి చేరుకోగా.. అక్కడ ఎలాంటి ఏర్పాట్లూ లేవు. ఇందులో జిల్లా సంక్షేమ అధికారి, స్థానిక అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. గతంలో పంపిణీ చేసిన బ్యాటరీ ట్రైసైకిళ్లు కొద్ది నెలలకే అక్కరకు రాకుండా పోయాయని, నాసిరకం పంపిణీ చేశారని పలువురు దివ్యాంగులు వాపోయారు. శిబిరానికి 168 మంది దివ్యాంగులు రాగా.. అందులో 40 మంది బ్యాటరీ, ట్రైసైకిల్ ఉపకరణాలకు, 71 మంది వీల్‌చైర్లు, చెవిటి యంత్రాలకు ఎంపికయ్యారు. సదరం సర్టిఫికెట్‌తో పాటు ఇతర సర్టిఫికెట్లు సక్రమంగా లేని పలువురి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు శిబిరాన్ని సందర్శించారు. జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, సూపరింటెండెంట్ రాజయ్య, సిడిపిఓ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంకు నర్సింగ్ కాలేజీ..!

- సింగరేణి నుంచి నాలుగెకరాల స్థలం
- తెలంగాణ వైద్య, విద్య డైరెక్టర్ కె.రమేశ్‌రెడ్డి
- రామగుండం జీజీహెచ్ ఆస్పత్రి తనిఖీ
- 85 బెడ్స్ భవన నిర్మాణం ఆలస్యంపై ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రమేశ్‌రెడ్డి

కోల్‌సిటీ(రామగుండం): రామగుండంలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు సింగరేణి సంస్థ నాలుగెకరాలు కేటాయించడానికి సముఖత వ్యక్తం చేసిందని తెలంగాణ వైద్య, విద్య డైరెక్టర్ (డీఎంఈ) కె.రమేశ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యుల రిజిస్టర్‌ను పరిశీలించారు. కొత్తగా నిర్మిస్తున్న 85 పడకల భవనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు పూర్తి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించారు.

నర్సింగ్ కాలేజీకి నాలుగెకరాలు..

సింగరేణి కేటాయించే నాలుగెకరాల్లో నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు చేపడుతామని రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా 5వేల మంది నర్సింగ్ స్టాఫ్‌ను తీసుకుంటున్నామని, బోధన ఆస్పత్రుల్లో కనీసం 3వేల మంది నర్సింగ్ స్టాఫ్‌ను నియమిస్తామని వెల్లడించారు. ప్రతి నర్సింగ్ కాలేజీలో 60 సీట్ల చొప్పున కేటాయిస్తామన్నారు. అన్ని సమకూరితే ఈ ఏడాది నుంచే క్లాసులు ప్రారంభిస్తామన్నారు.

ఖాళీలను భర్తీ చేస్తున్నాం..

కొత్తగా మెడికల్ కాలేజీలతోపాటు అప్‌గ్రేడైన ఆస్పత్రుల్లో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నట్లు రమేశ్‌రెడ్డి వెల్లడించారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రామగుండం వైద్య కళాశాలకు సింగరేణి వైద్య కళాశాలగా మార్చాలని వస్తున్న సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

మీడియాకు అనుమతి వద్దనలేదు..

డీఎంఈ ఆదేశాలంటూ జీజీహెచ్‌లోకి మీడియాను అనుమతించడం లేదని డీఎంఈ దృష్టికి తీసుకెళ్లడంతో తను ఎలాంటి ఆదేశాలూ జారీ చేయలేదని స్పష్టం చేశారు. ఆస్పత్రిలో మీడియాకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మీడియాకు అనుమతి లేకుంటే ఆస్పత్రిలో జరిగే పనులు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు భాను, అప్పారావు, తిరుమలేష పాల్గొన్నారు.

'బియ్యం' నిందితుల అరెస్ట్‌కు రంగం సిద్ధం

- మంథని ప్రాంతంలో దొరికిన డీలర్..?
- రేషన్‌షాపులకు బియ్యం సరఫరా ప్రారంభం



గోదాం నుంచి షాపులకు తరలిస్తున్న బియ్యం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు చేరాల్సిన రెండు బియ్యం లారీల మాయం ఘటనలో నిందితులను అరెస్ట్ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ఓ రేషన్ డీలర్‌ను మంథని నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతంలో అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు చెబుతున్నారు. గతనెల 27న సుద్దాల గోదాం నుంచి సుల్తానాబాద్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు రాకుండా అక్రమార్గంలో రేషన్ బియ్యాన్ని తరలించారని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు నిర్ధారించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో పలువురిని విచారించడంతో వారు అధికారుల ముందు పలు విషయాలు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

అధికారుల వద్ద పూర్తి సమాచారం

అక్రమంగా తరలివెళ్లిన 475 క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు లారీలు, దానికి సహకరించిన రేషన్ డీలర్, డాటాఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్ రెడ్డి, లారీ డ్రైవర్ కం ఓనర్లు ఆంజనేయులు, వెంకన్న నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించిన విజిలెన్స్ అధికారులు పోలీసులకు నివేదిక పంపించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కలెక్టర్ సంగీత ఆదేశంతో డీఎస్ఓ వెంకటేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీనివాస్‌రెడ్డితోపాటు కాంట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. గురువారం వీరందరినీ అరెస్ట్ చూపే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

రేషన్ షాపులకు బియ్యం

సుల్తానాబాద్‌లోని ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ బియ్యాన్ని రేషన్ షాపులకు తరలిస్తున్నారు. మంగళవారం నుంచి వివిధ గ్రామాల్లోని దుకాణాలకు లారీల ద్వారా సరఫరాకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ పనిచేస్తున్న గోదాం ఇన్‌చార్జి వెంకటరాజం సస్పెండ్ కాగా డాటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్ రెడ్డిని సర్వీస్ నుంచి రిమూవ్ చేశామని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం నాయబ్ తహసీల్దార్ మహేశ్ బాధ్యతలు స్వీకరించగా.. మంగళవారం డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా అనిల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వీరి ఆధ్వర్యంలో సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల మండలాలకు రేషన్ బియ్యం సరఫరా ప్రారంభించారు.

బాబోయ్ లీకుల గోల..!

- కలెక్టర్లు, సీపీ, ఎస్పీలను అలర్ట్ చేసిన ప్రభుత్వం
- ఆఖరు పరీక్ష వరకు నిర్వహణ బాధ్యత వారిదే
- నిర్లక్ష్యం వహించిన సిబ్బంది ఉద్యోగాలు పీకేస్తాం
- కలెక్టర్లు కూడా సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టంచేసిన మంత్రి, సీఎస్



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సబిత

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో వరుసగా వెలుగుచూస్తున్న లీకేజీలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రస్తుతం జరుగుతున్న పదోతరగతి పరీక్షల నేపథ్యంలో మరిన్ని పకడ్బందీ చర్యలకు ఉపక్రమించింది. రెండు రోజులపాటు తెలుగు, హిందీ పరీక్షల పేపర్లు వాట్సాప్ ద్వారా వైరల్ కావడంతో పరీక్షల నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఓవైపు టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల పేపర్లు లీకవడం, దానిపై సిట్ దర్యాప్తు జరుగుతుండగానే.. పదో తరగతి పరీక్ష పేపర్లు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతుండటాన్ని విద్యాశాఖ తీవ్రంగా పరిగణించింది. దీంతో బుధవారం నుంచి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అలజడులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

అన్ని జిల్లా కలెక్టర్లతో వీసీ..!

పదో తరగతి పేపర్లు వరుసగా సోషల్ మీడియాలో ప్రత్యక్షమవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెలుగు, మంగళవారం హిందీ పేపర్ వాట్సాప్ పేపర్లలో ప్రత్యక్షమైన తీరు పరీక్ష నిర్వహణలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. ఇది లీకేజీ కాదని చెబుతున్న పోలీసు ఉన్నతాధికారులు వాటిని సర్క్యులేట్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. మంగళవారం ఉదయం హిందీ పేపర్ బయటికి వచ్చిన వెంటనే.. ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు వచ్చిన ఆదేశాల మేరకు వారివారి జిల్లాల్లో సెంటర్లను ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డీజీపీ అంజనీకుమార్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్‌జయంతి, కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ సీపీ చంద్రశేఖర్, జగిత్యాల కలెక్టర్ యాస్మీన్ భాషా, ఎస్పీ భాస్కర్, పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ, రామగుండం సీపీ రెమా రాజేశ్వరితోపాటు పలువురు ఆర్డీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు సైతం ఫోన్ అనుమతి లేదు..

ఎలాంటి చిన్న నిర్లక్ష్యాన్నైనా సహించేది లేదని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్నవారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష నిర్వహణకు పూర్తిగా డీఈవోలను బాధ్యులను చేయాలని, అవకతవకలకు పాల్పడితే రిమూవల్ సర్వీస్ చేయాలని కలెక్టర్లకు సూచించారు. అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని పోలీసులకు సూచించారు. సెంటర్లను తనిఖీ చేసే కలెక్టర్లు, డీఈవోలు, తహసీల్దార్లు ఎవరైనా సరే లోనికి సెల్‌ఫోన్ అనుమతి లేదని స్పష్టంచేసినట్లు సమాచారం.

కరీంనగర్ పేరుతో ఉలికిపాటు..

మంగళవారం ఉదయం వరంగల్ జిల్లాలో వాట్సాప్‌లో ప్రత్యక్షమైన పదో తరగతి హిందీ పేపర్ ఉమ్మడి జిల్లా పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. పేపర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వాట్సాప్‌లో పోస్టులు చేశారని వార్తలు రావడంతో జగిత్యాల, సిరిసిల్ల, రామగుండం, కరీంనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇక ఇంటెలిజెన్స్ పోలీసులు కూడా ఈ వ్యవహారంలో ఆరా తీయడం ప్రారంభించారు. మొత్తానికి సాయంత్రానికి పేపర్ కరీంనగర్ జిల్లా నుంచి లీకవలేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పరీక్షా కేంద్రాల్లోకి ఫోన్‌లు అనుమతించొద్దు

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు అనుమతించొద్దని, ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. కలెక్టర్ సంగీత, పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ.. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో 144సెక్షన్ కచ్చితంగా అమలు చేస్తున్నామని, ప్రశ్నా,జవాబు పత్రాల తరలింపు సమయంలో అప్రమత్తంగా ఉంటున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


మణికృష్ణ

పాలకుర్తి(రామగుండం): మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధి యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి బి.మణికృష్ణ జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికై నట్లు కరస్పాండెంట్ ఇస్మాయిల్ మంగళ వారం తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మణికృష్ణ మొదటిస్థానంలో నిలిచాడు. చండీఘర్‌లో ఈనెలలో జరుగ నున్న జాతీయ పోటీల్లో పాల్గొంటాడు. ఈసం దర్భంగా మణికృష్ణను పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులు అభినందించారు.

నియామకం


నియామక పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): బహు జన సాహిత్య అకాడమీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రె టరీగా కాలనీకి చెందిన బాదే వెంకటేశం నియామకమయ్యారు. మంగళవారం హైద రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు నల్ల రాధా కృష్ణ అందజేశారు.

భద్రాద్రి తలంబ్రాలు పంపిణీ


తలంబ్రాలు పంపిణీ చేస్తున్న భానుకిరణ్

మంథని: భద్రాద్రి సీతారాముల కల్యాణం తలంబ్రాలను మంగళవారం మంథనిలో భక్తు లకు పంపిణీ చేశారు. ఆర్టీసీ కార్గో సేవల ద్వారా వచ్చిన ముత్యాల తలంబ్రాలు, గోటి తలంబ్రాలు పంపిణీ చేస్తున్నట్లు సీటీఎం భానుకిరణ్ తెలిపారు. ముందస్తుగా బుక్ చేసుకున్న భక్తులకు పంపిణీ చేస్తున్నామని, ఈ నెల పదో తేదీ వరకు బుకింగ్‌కు అవకాశం ఉందని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల భక్తులు కార్గో కేంద్రాలతో పాటు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వద్ద రూ.116 చెల్లించి బుక్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏటీఎం శ్రీనివాస్, ఆర్ఎంఈ రాజు, డీఎంఈ రాజేశ్వర్ ఉన్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

పెద్దపల్లిరూరల్: అగ్నిప్రమాదాలు సంభవిం చినప్పుడు నియంత్రించేందుకు పాటించాలి్సన పద్ధతులపై కనీస అవగాహన ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలో మంగళవారం పలు ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. వేసవికాలంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉంటోందని పాఠశాలలు, ఆసుప త్రుల నిర్వాహకులు బహుళ అంతస్తుల్లో అగ్నిప్రమాద నియంత్రణకు అవసరమైన పరికరాలను అమర్చుకోవాలని సూచించారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో సరైన పరికరాలు లేనట్లు గుర్తించి ఫైర్ ఎక్స్‌టిన్యూషర్ ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. కార్యక్రమం లో సిబ్బంది మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

మినీ గురుకులంలో ప్రవేశాలకు మే 4 తుదిగడువు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ధర్మారం మినీ గురుకులంలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి గల విద్యార్థినులు మే 4లోగా దరఖాస్తు చేసు కోవాలని గిరిజన సంక్షేమ గురుకుల ప్రాం తీయ సమన్వయ అధికారి డీఎస్ వెంకన్న కోరారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉం టుందని ఇతర వివరాలకు 96420 75518 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లక్ష్యానికి చేరువలో ఈ- శ్రమ్

- నమోదు చేసుకునేందుకు కార్మికుల ఆసక్తి
- జిల్లాలో ఇప్పటివరకు 1,29,123 మంది నమోదు


కార్మికుల వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

సుల్తానాబాద్(పెద్దపల్లి) : సంక్షోభ సమయంలో సాయంపొందేలా.. అసంఘటిత రంగ కార్మికు లకు సంక్షేమ పథకాలు అందించేందుకు 2021 ఆగస్టు 26న కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్ట ల్‌ను ప్రారంభించింది. ఇందులో వివరాలు నమోదు చేసుకున్న తర్వాత కార్మిక, ఉపాధి మం త్రిత్వ శాఖ ద్వారా డిజిటల్ ఈ-శ్రమ్ కార్డులను అందజేశారు. కార్డుపై ఉన్న నెంబర్ దేశవ్యాప్తం గా చెల్లుబాటు అవుతుంది. ఇతర రాష్ట్రాల్లోనూ కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయో జనాలు పొందొచ్చు. రెండేళ్ల కిందట ప్రవేశ పెట్టగా ఈ 'శ్రమ్' పోర్టల్‌కు స్పందన లభిస్తోం దని అధికారులు తెలుపుతున్నారు. ఇటీవల పెద్ద పెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నియోజక వర్గ వ్యాప్తంగా కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పెద్దపల్లి సుల్తానాబాద్, ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో కార్మికులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ మంది నిరక్షరాస్యులు కావడం, ఈ-శ్రమ్ కార్డు ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించడంతో చాలా మంది నమోదు చేసుకుంటున్నారు.

కార్మికరంగంలోనే ఎక్కువమంది..

జిల్లాలో అసంఘటిత కార్మిక రంగంలో అత్యధిక మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 14 మండలాలు గోదావరిఖని కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపల్ ఉన్నాయి. అందులో అత్యధికంగా గోదావరిఖని, రామగుం డం, సుల్తానాబాద్, మంథని, పెద్దపల్లి. కమాన్ పూర్, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, రామగిరి, ధర్మా రంతో పాటు పలు ప్రాంతాల్లో అసంఘటిత కార్మిక రంగం పనులు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఈశ్రమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రచారం నిర్వహించాల్సిన అవ సరం ఉంది

ప్రయోజనాలివే..

జిల్లావ్యాప్తంగా లక్షా 50 వేలమంది కార్మికులు ఉండగా ఈ-శ్రమ్‌లో ఇప్పటివరకు 1,29,123 మంది నమోదు చేసుకున్నారు. కార్డుపొందిన వారికి ప్రభుత్వం రూ.2లక్షలు ప్రమాద బీమా పథకాన్ని కల్పిస్తోంది. గాయపడి వైకల్యం ఏర్ప డితే రూ.లక్షసాయం అందిస్తుంది. కుటుంబ సభ్యుల వివాహం, చదువు, ప్రసవాలకు సాయా న్ని అందజేస్తుంది.

అర్హతలు ఇవే..

18–59 ఏళ్ల మధ్య ఉన్న అసంఘటిత కార్మికులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించని వారు కార్డు పొందేందుకు అర్హులు. అడ్డా కూలీ, షాపింగ్ మాల్, హోటల్స్, పేయింట్, కార్పెంట ర్, ఎలక్ట్రీషియన్, చేనేత కార్మికులు, వడ్రంగులు, ఇటుక బట్టీ, చేనేత, క్వారీ కార్మికులు, రైస్ మిల్లు ల్లో పనిచేసేవారు, వలస కూలీలు, వీధివర్తకులు, ఆటో డ్రైవర్లు, రజకులు, పండ్ల వ్యాపారులు, గీత కార్మికులు, మత్స్య, భవన నిర్మాణ కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో అసంఘటిత రంగ కార్మికుల నుం చి స్పందన లభిస్తోంది. కార్మికులు నమోదు చేసుకునేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అర్హులు ఈ-శ్రమ్ కార్డుకోసం దరఖాస్తు చేసుకొని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.
– రామ్మోహన్, ఇన్‌చార్జి పెద్దపల్లి

కౌలు రైతులకు తప్పని తిప్పలు

- పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు అందక ఇబ్బందులు
- బయట అధిక వడ్డీకి అప్పులు తెస్తూ పంటలను సాగు చేస్తున్న వైనం
- ప్రతీ సీజన్‌లో ఇదే దుస్థితి
- పట్టించుకోని పాలకులు


వరికి రసాయన మందు స్ప్రే చేస్తున్న కౌలు రైతు

ఎలిగేడు(పెద్దపల్లి): సొంత భూములు లేక కౌలుపై ఆధారపడి జీవిస్తున్న కౌలురైతుల జీవితాలు దుర్భ రంగా మారాయి. పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 1,40,072 మంది రైతులుండగా అందులో కౌలు రైతులు సుమారు 15వేల మందికి పైగా ఉన్నట్లు అనాధికార అంచనా. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపా రులు, భూస్వాములు పట్టణ ప్రాంతాలకు వెళ్లి స్థిర పడుతుండగా , గ్రామాల్లో ఉన్న వారికి వ్యవసాయ భూములను కౌలుకు ఇస్తున్నారు. కాగా రాష్ట్రప్ర భుత్వం రైతులకు అందించే ఏ పథకాలు కూడా కౌలురైతులకు వర్తించడం లేదు. సర్కారు ఇస్తున్న రైతుబంధు సాయం కూడా భూ యజమానులకే చేరుతోంది. బ్యాంకు రుణాలు, సబ్సిడీ విత్తనాలు ఏవీ వర్తించవు. చివరకు పంటసాగు చేయగా వచ్చిన దిగుబడిని అమ్ముకోవాలన్నా ఇతర రైతుల పేరుమీద కాంటా వేయించి డబ్బులు వారి ఖాతాల్లో జమైన తర్వాత బతిమాలి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వ్యసాయం తప్ప ఇతర పనులు తెలియని కౌలురైతులు ఏడాదంతా కష్టపడి పండిం చిన పంట అమ్మగా వచ్చిన డబ్బులు, కౌలుకోసం చేసిన అప్పులు, వడ్డీలకే సరిపోతున్నాయి.

ప్రకృతి వైపరీత్యాలు వస్తే అంతే..

భూ యజమానులకు కౌలుడబ్బులు ముందే చెల్లిం చాలి. పెట్టుబడులు పెట్టి పంటలకు మందులు స్ప్రే చేసి కాపాడుకుంటూ చేతికందే దశలో వడగళ్ల వానాలు, ఈదురుగాలులకు అపారనష్టం సంభవిస్తే కౌలు రైతులను ఆదుకునే నాథుడే లేడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వడగండ్ల వానలు కురిసి పంటలకు అపార నష్టం వాటిల్లింది. దీంతో పంటలకు నష్టం వాటిల్లి కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇటీవల సీఎం కేసీఆర్ కరీంనగర్ జిల్లాలో పర్యటించి కౌలురైతులకు పరిహారం ఇస్తామని పేర్కొనడం కొంత ఊరట కలిగించింది.

పెరుగుతున్న పెట్టుబడులు

రోజురోజుకు పంటల పెట్టుబడి, ఖర్చులు, కూలీ లకు సైతం రేట్లు పెరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వం నుంచి సహకారం పొందుతున్న రైతులకే గిట్టుబాటు కావడంలేదని ఆందోళన చెందుతు న్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతం. రెక్కల కష్టం కూడా మిగిలే పరిస్థితి లేకుండా పోయింది. ఎకరంలో పత్తిసాగుకు రూ.20వేలకు పైగా, వరికి రూ.25వేలకు పైగా ఖర్చుఅవుతోంది. ఎకరం కౌలుకు రూ.20వేలు.. విత్తనాలు, ఎరువు లకు అధిక పెట్టుబడి అవుతోంది. కుటుంబమంతా చేసిన కష్టం ఎందుకు పనికిరాకుండా పోతోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుణాలు ఇవ్వాలి



వ్యవసాయం తప్ప వేరేపని చేయలేక భూమిని కౌలుకు తీసుకుని పంటలు పం డిస్తున్నాం. రైతులకు ఇచి్చనట్లుగా రైతుబంధు, బ్యాంకు రుణాలు, సబ్సిడీ విత్తనాలు కూడా కౌలురైతులకు అందించాలి. కౌలు రైతుల పేరిట పంటలు కొనుగోలు చేయాలి.
– నందనవేని రాజయ్య, కౌలురైతు,

గుర్తింపుకార్డులు అందించాలి



ప్రభుత్వం కౌలు రైతుల వివరాలు పూర్తిగా సేకరించి గుర్తింపు కార్డులు అందించాలి. బ్యాంకుల ద్వారా రుణాలు, సబ్సిడీపై ఎరు వులు, విత్తనాలు అందించాలి. ప్రకృతీ వైపరిత్యాలతో నష్టపోయిన వారిని ఆర్థికంగా ఆదుకోవాలి.
– మేడి తిరుపతి, కౌలురైతు

బొగ్గుబాయి వార్తలు

మెరుగైన ఒప్పందం సాధించేలా కృషి


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): కోల్‌కత్తాలో ఈనెల 18న జరిగే 11వ వేతన ఒప్పందంలో మెరుగైన అగ్రిమెంట్ సాధించేలా కృషి చేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. మంగ ళవారం ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. వేజ్ బోర్డులో 19శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్ అంగీకారం కుదిరింద న్నారు. మిగిలిన అంశాలపై మేనేజ్‌మెంట్ పూర్తిస్థా యిలో సానుకూలమైన వాతావరణంలో చర్చలు జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. వేతన పరి ష్కారంలో మిగిలిన ఇతర అంశాలపై ఇంకా ఏకాభి ప్రాయం లేకున్నా ఒప్పందం కుదిరిన తర్వాతే మం త్రిత్వశాఖ ఆమోదం కోసం పంపబడుతుందన్నారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని త్వర లో వేజ్‌బోర్డు ఒప్పందం ఖరారు చేసేలా కోల్ ఇం డియా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామని వివరిం చారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి కుమార స్వామి, సారంగపాణి, మాదాసు రవీందర్, నీలం రవి, మంచినీళ్ల స్వామి, చిర్ర ఆంజనేయులు, పోత రాజు భాస్కర్, యాదగిరి నరేష్, ఈదునూరి శ్రీని వాస్, ఉప్పులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


యూనియన్‌లోకి కార్మికులను స్వాగతిస్తున్న సత్యనారాయణరెడ్డి

జ్యోతినగర్(రామగుండం): భవన నిర్మాణరంగ కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండంలోని యూనియన్ కార్యాలయంలో భవన నిర్మాణరంగ కార్మికులు పలువురు యూనియన్‌లో చేరిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వేల కోట్ల రూపాయలు భవన నిర్మా ణరంగంలో ఉన్నా కార్మికులకు ఎలాంటి ప్రయో జనాలు లేవన్నారు. భవన నిర్మాణ రంగాన్ని కీలక రంగంగా గుర్తించి ప్రత్యేక సంక్షేమ పథకాలు అమ లు చేయాలన్నారు. ఈసందర్భంగా యూనియన్‌లో చేరినవారికి కండువాలు కప్పి స్వాగతించారు. కార్య క్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్య దర్శి జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, కాల్వ రాయమల్లు, మల్లయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

- రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య


మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం సాంబయ్య

గోదావరిఖని(రామగుండం): రక్షణతో కూడిన ఉత్ప త్తి సాధించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని రామ గుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య పిలుపు నిచ్చారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే –11గనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం చిం తల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. సేఫ్టీ మేనేజ్మెం ట్ ప్లాన్ అమలు చేయడంపై గుర్తు చేశారు. రక్షణ చర్యలు పాటించిన తర్వాతే బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో అధికారు లు బి.సత్యనారాయణ, శ్రీనివాస్, నెహ్రూ, రాం దాస్, రాజబాబు, జాన్సన్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శకటోత్సవం

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు


జాతరలో ఎడ్ల బండ్ల ప్రదర్శన

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా మంగళవారం శకటోత్సవం కన్నుల పండువగా జరిగింది. రైతులు తమ ఎడ్ల బండ్లను అలంకరించి స్వామివారు కొలువైన గుట్ట చుట్టూ శోభాయాత్ర నిర్వహించారు. పెద్దాపూర్ గ్రామ ట్రాక్టర్ ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో ప్రదర్శనగా వచ్చి కోరమీసాలస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మన్ ఎడ్లబండ్ల ప్రదర్శ నలో పాల్గొన్నారు. శకటోత్సవంలో ఎలాంటి అవాం ఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి జాతర నిర్వహిం చే ప్రాంతాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీ టీసీ గొట్టిముక్కుల రజనీ రవీందర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సిబ్బంది జితేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు ఏకమైతే భవిష్యత్ ఉండదనే భయం

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు


విగ్రహావిష్కరణ చేస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: మంథని నియోజకవర్గంలో బహుజనులం తా ఏకమైతే భవిష్యత్ ఉండదనే భయంతోనే స్థానిక ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కక్షకట్టి కుట్రలు చేస్తు న్నారని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు ఆరోపిం చారు. మండలంలోని సూరయ్యపల్లి ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన ఏకలవ్యుడి విగ్రహాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి ఆవిష్కరించారు. మహనీయుల చరిత్రను చాటిచెప్పాలని విగ్రహాలు ఏర్పాటు చేస్తుంటే అడ్డుకుంటున్నారన్నారు. నాడు అంబేడ్కర్ విగ్రహం మొదలు నేడు ఏకలవ్యుడి విగ్ర హం ఏర్పాటు వరకు అనేక అడ్డంకులు సృష్టించార న్నారు. ఎమ్మెల్యే వెంట తిరిగే బహుజనులంతా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని, బ్రాహ్మ ణీయ పాలన సమాజంలో ఎవరిని గౌరవించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్ లాల్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఏకలవ్య సం క్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు విలువ తెలిస్తే అగ్రస్థానంలో ఉండేది

గత పాలకుల నిర్లక్ష్యం మూలంగానే మంథని ప్రాం తం అనేక ఏళ్ల వెనుకబాటుకు గురైందని, నాటి నుంచి నేటి వరకు ఓటు విలువ తెలియకపోవడం మూలంగానే అగ్రస్థానంలో నిలుపలేకపోయామని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంగళ వారం మంథనిలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో మంథని విద్యా ర్థి యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. నియో జకవర్గానికి ఓ వైపు గోదావరినది, మానేరు, ఇంకో వైపు అటవీ సంపద, మరో వైపు బొగ్గు గనులు ఉన్నా చీకటి రాజ్యమే ఏలిందన్నారు. కేవలం అధికారం కోసమే నాటి పాలకులు ఆరాటపడ్డారని, ప్రజల శ్రేయస్సును పట్టించుకోలేదని విమర్శిం చారు. పలువురు సమస్యలను ఆయన దృష్టికి తీసు కురాగా వాటిపై స్పందించి వివరించారు. విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి, మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు ఆరోగ్య మహిళా కేంద్రాలు


వైద్యురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

మంథని: ఆరోగ్య మహిళా కేంద్రాల ద్వారా మహిళల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు కృ షి చేయాలని కలెక్టర్ డా.సంగీత సత్య నారాయణ సూచించారు. మంథని మండ లం గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రం లో థైరాయిడ్, అనీమియా, సూక్ష్మ పోషకాల లోపం పరీక్ష, క్యాన్సర్ లక్షణాల క్లినికల్ పరిశీలన చేయాలని సూచించారు. ఆరోగ్య మహిళా కేంద్రాలను మహిళలు వినియోగిం చుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాల న్నారు. మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి వీరబ్రహ్మచారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ ప్రకాష్, వైద్యురాలు శంకరాదేవి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూల పల్లి గ్రామానికి చెందిన సాగర్ల మల్లేశ్(43) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతిచెం దాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివ రాలు.. మల్లేశ్ సింగరేణి సంస్థలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుండగా, రెండునె లల క్రితం అతడి తండ్రి అనారోగ్యంతో మృ తిచెందాడు. నిరుపేద కుటుంబం కావడం, అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురైన మల్లేశ్ సోమవారం క్రిమిసంహార మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్ప త్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మం గళవారం మృతిచెందాడు. మృతుడి కుమా రుడు అంజనివరప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

రామగుండం: ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా బృ ందాన్ని ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో నిరంతరం ఆక స్మిక తనిఖీలకు శ్రీకారం చుడతామని అంతర్గాం తహ సీల్దార్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల క్షేత్ర స్థాయి తనిఖీల్లో అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుబడిన ఇసుకను కార్యాలయ ప్రాంగణంలో డంపింగ్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుం డం కార్పొరేషన్ పరిధిలో డబుల్ బెడ్‌రూం గృహ నిర్మాణాలకు 2.37 ఎకరాల విస్తీర్ణంలో 3.56 క్యూబిక్ మీటర్ల ఇసుకను తర లించుకునేందుకు పది టిప్పర్లకు అధికారిక అనుమతులు జారీ చేశామని కేవలం వాటికి మాత్రమే సడలింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో మళ్లీ అక్రమదందా పెచ్చు మీరుతున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఇసుక క్వారీలో రెవెన్యూ సిబ్బంది సైతం దళారులతో చేతులు కలిపి అక్రమదందాకు తెరలేపుతున్నట్లు తెలుస్తుందని, అలాం టి వారిని గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామ న్నారు. అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్లు పట్టుబడితే ఎం తటివారినైనా ఉపేక్షించేది లేదని, ట్రాక్టర్లను సీజ్ చేసి అక్రమా ర్కులపై కేసులు నమోదు చేయిస్తామని పేర్కొన్నారు. తమ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సుమారు 30 ట్రిప్పుల డంపు నకు ఇసుక కొరత ఏర్పడినపుడు (వర్షాకాలం అన్‌సీజన్) బహి రంగ వేలం నిర్వహించి వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని తెలిపారు.

యువ కార్మికుల చేతుల్లోనే సింగరేణి భవిష్యత్


మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి భవిష్యత్ యవ కార్మికుల చేతుల్లోనే ఉందని ఆర్జీ–2 టీబీజీకే ఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ పేర్కొన్నారు. మం గళవారం వకీల్‌పల్లిగనిలో యువకార్మికుల సమ్మేళ నానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ సమస్యల సాధనకు యువత ఇలా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామన్నారు. కలిసికట్టుగా ఉండి సమస్యలు పరిష్కరించు కోవాలని, జాతీయ సంఘాల మాటలు నమ్మి మోస పోవద్దన్నారు. అన్యాయాన్ని ఎదిరించే నాయకు లుగా తయారు కావాలన్నారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి వై.మల్లికార్జున్, నాయకులు సంపత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ఆవుల రాములు, సిరిశెట్టి రాములు, వేగోలపు రాజు, శ్రీకాంత్, నవీన్, నాగర్జున, ఓదెలు, అరవింద్, వెంకటేష్, శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల సాధనకు ఉద్యమం


మాట్లాడుతున్న భిక్షమయ్య

జ్యోతినగర్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ ఉద్యమాన్ని కొన సాగించాలని, ఇందుకు సీపీఎం అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బొజ్జ భిక్షమయ్య అన్నారు. మంగళవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలో మహిళలు చేస్తున్న భూపోరాట శిబిరాన్ని సందర్శించారు. ఇళ్ల స్థలాల కోసం 17రోజులుగా నిరసన చేస్తున్నా ప్రభుత్వం పట్టిం చుకోకపోవడం సరికాదన్నారు. ఇళ్ల స్థలాల సాధన కమిటీ కన్వీనర్ ఎస్.భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు రామా చారి, గీట్ల లక్ష్మారెడ్డి, భాగ్య, రమణక్క, సుజాత పాల్గొన్నారు.

పీడిత ప్రజల తరపున పోరాటం

గోదావరిఖని: పీడిత ప్రజల తరపున పోరాడేది సీపీఎం ఒక్కటే నని భిక్షమయ్య అన్నారు. స్థానిక పవర్‌హౌజ్‌కాలనీలో నిర్వహి స్తున్న భూపోరాట కేంద్రాన్ని సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలకు కనువిప్పు కలిగించేలా భూపోరాట కార్యాచరణ తీసుకు న్నామన్నారు. రూ.కోట్ల విలువైన భూమి అక్రమంగా ఆక్రమిం చుకొని హద్దులు పెట్టుకున్న వారిపై తక్షణమే చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు.